క్లుప్తంగా

కూటమిని తరిమికొట్టాలి



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మంగళవారం 35వ డివిజన్ బొగ్గులైన్ కాలనీలోని తెలుగు బాప్టిస్ట్‌చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రైల్వే క్రిస్టియన్ సమాజంతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు కుల, మతాలకు అతీతంగా శాంతియుత జీవనాన్ని సాగిస్తున్నారని చెప్పారు. వారి మధ్య విభేదాలు సృష్టించి రాజకీయాలు చేయాలని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టే పార్టీలను తరిమి కొట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుబ్బా చంద్రశేఖర్, చర్చి ఫాదర్ తారా ప్రకాష్, కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు, సంగీత్‌బాబు పాల్గొన్నారు.

జలీల్‌ఖాన్ ముస్లింల ద్రోహి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ శాసన సభ్యుడు జలీల్‌ఖాన్ మతతత్వ పార్టీలతో కుమ్మక్కై ముస్లింలను బీజేపీకి ఓటు వేయాలని కోరటం దుర్మార్గమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ బాషి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జలీల్‌ఖాన్ ముస్లింల ద్రోహి అని ధ్వజమెత్తారు. పశ్చిమ నియోజకవర్గంలో రెండు సార్లు శాసనసభ్యుడిగా పని చేసి మతతత్వ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని పక్కన పెట్టుకొని ఆయనకు ఓటు వేయాలంటూ ప్రమాణాలు చేయించటం దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్‌ను గమనంలో ఉంచుకొని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. అలాగే ఎన్నో అభివృద్ధి పనులు చేశారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని సాధిస్తుందన్నారు. మాయ హామీలతో వచ్చే పార్టీలను తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో షేక్ ఆసిఫ్ అద్భుతమైన మెజార్టీని సాధిస్తారని వివరించారు.

కేబీఎన్‌లో స్వల్పకాలిక కంప్యూటర్ కోర్సులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావ నారాయణ కళాశాలలో కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో స్వల్పకాలిక కంప్యూటర్ కోర్సులను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం వేసవి సెలవులను పురస్కరించుకొని తక్కువ ఫీజుతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, టాలీప్రైమ్, కోర్సులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు నెలల కాలపరిమితితో ఈ కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. రోజు ఒక గంట తరగతి బోధనతో పాటుగా మరో గంట ల్యాబ్ సదుపాయాన్ని అందిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెం - 9849517440కు సంప్రదించాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన ఆరుగురు పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ చేసిన కె..వెంకటేశ్వరరావు (ఎస్ఐ), ఎండీగౌస్(ఎస్ఐ), ఎండీ షరీపుల్లా (ఏఎస్ఐ), కె.బాబురావు (ఏఆర్ఎస్ఐ), ఎంవీ బాస్కర రావు (హెడ్ కానిస్టేబుల్), పి.వెంకటేశ్వరరావు (హెడ్ కానిస్టేబుల్)ను కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీసీపీ కె.శ్రీనివాసరావు, ఇన్ చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ టి.కనకరాజు, ఏవో రంగారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు సోమయ్య పాల్గొన్నారు.

'స్ఫూర్తి'లో వేసవి శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ సంస్థ ఆధ్వర్యంలో వేసవి కాలం సందర్భంగా ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని 'స్ఫూర్తి' క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, పెన్ డ్రాయింగ్, కార్టూన్స్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ, పేపర్ క్విల్లింగ్, క్లే మౌల్డింగ్, మండాల ఆర్ట్, మైక్రో ఆర్ట్, లీఫ్ ఆర్ట్, ఫొటోగ్రఫీ, ఫొటోషాప్, డిజిటల్ పెయింటింగ్‌ల్లో నామమాత్రపు ఫీజుతో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు గాయత్రి నగర్, వాసిరెడ్డి శివరామకృష్ణయ్య వీధిలో సంస్థలో సంప్రదించాలని కోరారు.

అబద్ధపు హామీలతో చంద్రబాబు మోసం

పశ్చిమ ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) విమర్శించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 41, 43వ డివిజన్లలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. కార్పొరేటర్ ఎండీ. ఇర్ఫాన్‌తో కలిసి వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పర్యటించారు.

డివిజన్‌లలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా మేనిఫెస్టోను వెబ్ సైట్ నుంచి మాయం చేశారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా అభివృద్ధి, సంక్షేమం అందించారని పేర్కొన్నారు. వైఎస్ జగన్ ప్రజా పాలకుడని చెప్పారు. చంద్రబాబు ప్రజలకు మంచి చేసే విషయంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారన్నారు. మళ్లీ కూటమిగా వచ్చి అలవికాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేయాలని చంద్రబాబు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనలో వైఎస్ జగన్‌కు చంద్రబాబుకు ఉన్న తేడాను గమనించాలని కోరారు. బాబు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు.

పారాచూట్ నాయకులను తరిమికొట్టాలి: అసిఫ్

బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి బ్యాంకులను దోచుకున్న దొంగ అని ఆసిఫ్ విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గాన్ని సింగపూర్ చేస్తానంటూ మాయమాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఇటువంటి పారాచూట్ నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సుజనా చౌదరి, చంద్రబాబు ప్రజలకు మాయమాటలు, హామీలు ఇస్తూ మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు వెదజల్లి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు. జలీల్ ఖాన్ మరోసారి ముస్లింలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. జలీల్‌ఖాన్ గతంలో ఏం చేశారో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తారన్నారు. ఈ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ సాధిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 175 స్థానాలు వైఎస్సార్ సీపీ గెలుచుకుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, జిల్లావక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్లు అర్షద్, ఆంజనేయ రెడ్డి, కోటిరెడ్డి, చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా, ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు బూదాల శీను, అబ్దుల్ వహాబ్, బత్తుల పాండు, బాషి, డివిజన్ నాయకులు కరీముల్లా, ఇస్మాయిల్, అజిత్, రాజు, ఆనంద్, కలీం, గౌస్, రెహమాన్, ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమంలో జోరుగా వైఎస్సార్ సీపీ ప్రచారం

బేజారవుతున్న కూటమి నేతలు



పశ్చిమంలో అసిఫ్ ప్రచారంలో నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా ముందుకు సాగుతోంది. నామినేషన్ల పర్వం ముగియటంతో అభ్యర్థులు పూర్తిగా ప్రచారంపై దృష్టి పెట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్ తన ప్రచారాన్ని మరింత విస్తృతం చేశారు. నియోజకవర్గంలో వాడవాడలా పార్టీ నేతలు తమ ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. డివిజన్ నాయకులతో వివిధ స్థాయిల్లో సమావేశాలు ఒకవైపు నిర్వహిస్తునే మరోవైపు ఆయా డివిజన్‌లలో గడపగడపకు వెళ్తూ తమకు మద్దతు ప్రకటించాలని ఓటర్లను పార్టీ శ్రేణులు అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులందరూ ప్రచార పర్వంలో భాగస్వాములవుతున్నారు. భవానీపురం, వించిపేట, రాజరాజేశ్వరిపేట, కొత్తపేట ఇలా అన్ని ప్రాంతాల్లో ప్రచారం జోరందుకుంది.

మేనిఫెస్టోపై సంతృప్తి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో మేనిఫెస్టోపై ప్రతి ఒక్కరూ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం నిలబెట్టుకున్నారని ప్రతి ఒక్కరూ పార్టీ శ్రేణుల వద్ద ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబంలో పింఛను వస్తుందని, ఇంటి స్థలం వచ్చిందని, అమ్మ ఒడి పడుతుందని, చేయూత, ఆసరా వంటి అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయంటూ చెప్పటమే కాకుండా జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవటానికి తామంతా సిద్ధంగా ఉన్నామని ప్రజలు భరోసానిస్తున్నారు. తాజాగా జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోకు ప్రజలు ఆమోదం తెలుపుతున్నారు. జగనన్న కేవలం ఆచరణలో సాధ్యమయ్యేవే ప్రజలకు చెబుతున్నారంటూ కితాబు పలుకుతున్నారు. చంద్రబాబు ఇచ్చే హామీలను మేం నమ్మం అంటూ ప్రజలు చెబుతున్నారు. 2014లో ఇచ్చిన హామీలతో తమను మోసం చేశారని, మళ్లీ అదేరీతిలో మోసం చేయటానికి ప్రయత్నిస్తున్నారంటూ వ్యాఖ్యానిస్తున్నారు.



వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతున్న అసిఫ్

బేజారవుతున్న కమలం నేతలు...

కూటమి పక్షాన పశ్చిమ నియోజకవర్గంలో పోటీ పడుతున్న బీజేపీ నేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి లభిస్తున్న ఆదరణ చూసి బేజారవుతున్నారు. బ్యాంకులను మోసం చేసి, తప్పుడు పత్రాలతో హామీలిచ్చి వేల కోట్లు దండుకున్నట్లుగా సుజనాచౌదరిపై ఆరోపణలు ఉండటం, వాటిపై కేసులు కొనసాగుతుండటంతో ప్రజలు సుజనాను నమ్మటం లేదు. దానికి తోడు బీజేపీని పశ్చిమ నియోజకవర్గ ప్రజలు ఆదరించరనే వాదన ఉండటంతో కమలం నేతలు కలవరపడుతున్నారు. పరిస్థితులను గమనిస్తున్న టీడీపీ నేతలు ఒక్కొక్కరుగా ఇప్పటికే జారుకుంటున్నారు. స్థానికంగా ఉన్న జనసేన నేతలు ఎవరూ లేకపోవటంతో బయట నుంచి వచ్చిన నాయకులతో ప్రచారానికి తిరుగుతున్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం



అసిఫ్‌ను సత్కరిస్తున్న పోతిన మహేష్, చిత్రంలో సత్తార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికలకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోమారు అధికారంలోకి రావడం ఖాయమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ మంగళవారం సాయంత్రం విద్యాధరపురంలోని పార్టీ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చి అసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసిఫ్‌ను శాలువాతో సత్కరించి రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), మీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామ రక్ష అని, వాటి కొనసాగింపునకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్న దీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసిఫ్ మాట్లాడుతూ గెలుపు కోసం ఎన్ని కుట్రలు పన్నినా కూటమి ఓటమి తప్పదని పేర్కొన్నారు. కూటమి అపవిత్రత, అనైతిక పొత్తు టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో విడుదలలో తేలిపోయిందన్నారు. అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతో కూడిన కూటమి మేనిఫెస్టోను ప్రజలు విశ్వసించరని వెల్లడించారు. విశ్వసనీయతకు సీఎం జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టో ప్రతీకగా నిలిచిందన్నారు. 'చెయ్యగలిగిందే చెబుతాం..చెప్పింది చేస్తాం' అన్న జగనన్న మాటలు అక్షర సత్యాలని తెలిపారు. హామీల్లో 99 శాతం నెరవేర్చడమే అందుకు నిదర్శనమన్నారు. అసిఫ్ సోదరుడు ఎస్‌కె సత్తార్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి



కేసులు విచారిస్తున్న జడ్జి విజయ్ కుమార్ రెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ కోర్ట్ న్యాయమూర్తి బి.విజయ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. 47వ డివిజన్ పరిధిలోని సర్కిల్-1 కార్యాలయంలో మంగళవారం మొబైల్ కోర్ట్ జరిగింది. సర్కిల్- కార్యాలయం పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 25 కేసులపై ఆయన విచారణ జరిపి రూ.14,730 జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేసి నగర పరిశుభ్రతకు తూట్లు పొడవద్దని సూచించారు. ముఖ్యంగా డ్రెయిన్లలో చెత్తాచెదారం పడేసి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించవద్దని కోరారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించేవారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఒకసారి జరిమానా విధించాక రెండో సారికూడా అదే తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్-1 డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎన్నికల పరిశీలకులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని మంగళవారం జిల్లాలోని మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఎన్నికల జనరల్ పరిశీలకులు నరేంద్ర సింగ్‌బాలి, దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు, ఆలయ అధికారులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా సంగీత కళాశాల వార్షికోత్సవం



వీణపై సంప్రదాయ కీర్తనలు పలికిస్తున్న విద్యార్థినులు



దండమూడి సుమతీ రామ్మోనరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల వార్షికోత్సవం కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగీతం అభ్యాసం చేసిన ఎందరో విద్యార్థులు ఉన్నతస్థితిలో ఉన్నారని చెప్పారు. భరతనాట్యం అధ్యాపకురాలు భాగవతుల సౌమ్య భరత నాట్య బృందం సంప్రదాయంలోనూ, అజయకుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. వయోలిన్ అధ్యాపకురాలు కృష్ణవేణి బృందం వయోలిన్‌పై పలు అంశాలను ప్రదర్శించారు. గాత్ర విభాగానికి సంబంధించి, లక్ష్మీనరసమ్మ, మల్లాది కార్తీక త్రివేణి, శోభాలక్ష్మి బృందాలు శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుతూ పలు సంకీర్తనలు, దేశ భక్తి గీతాలు ఆలపించారు. వీణ అధ్యాపకురాలు మాధవి, మృదంగం అధ్యాపలు ఫల్గుణ్, స్టీవెన్‌రాజు, తబలా అధ్యాపకుడు అమృత కుమార్ తన విద్యార్థుతో పలు అంశాలను ప్రదర్శించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత దండమూడి సుమతీ రామ్మోనరావును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త బాలాంత్రపు ప్రసూన, గోళ్ళ నారాయణ రావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం శ్రీ శారదా నృత్య కళాపీఠంకు చెందిన పలువురు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్యాచార్య సంతోష్ పర్యవేక్షణలో కళాపీఠానికి చెందిన వారు పలు అమ్మవారి కీర్తనలకు నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను పెద్ద ఎత్తున భక్తులు హాజరై వీక్షించారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగులు



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న కేశినేని శ్వేత, పుణ్యశీల తదితరులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఆయనను తిరిగి ముఖ్యమంత్రిగా చేయాలనే లక్ష్యంతో ఉన్నారని కేశినేని శ్వేత తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు మద్దతుగా మంగళవారం ఆమె ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలిసి 34, 35వ డివిజన్‌లలో పర్యటించారు. పూర్ణానందంపేట, ఆర్.ఈ కాలనీ, కేదారేశ్వరపేట తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయటంతో పాటు ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని చెప్పారు. అమ్మఒడి, విద్యాదీవెన, ఆసరా వంటి పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కేశినేని నాని విజయవాడ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. దుర్గ గుడి, బెంజి సర్కిల్ ఫ్లై ఓవర్ల నిర్మాణంతో పాటు ఆటోనగర్‌లో వాటర్ ట్యాంక్‌ను నిర్మించి ఆ ప్రాంత వాసుల తాగు నీటి కష్టాలు తీర్చిన ఘనత నానీదేనన్నారు. అసిఫ్ స్థానికుడని ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించే వ్యక్తి అన్నారు. వారిద్దరిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, నాయకులు సంగీత్‌బాబు, బండి రాజ్‌కుమార్, సుజాత దాస్, బ్యూలా, మాబు, రాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సేవలు ప్రశంసనీయం

సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి



సాయిబాబా దంపతులను సత్కరిస్తున్న కమిషనర్ విజయకుమార్‌రెడ్డి, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార, పౌర సంబంధాల శాఖలో ప్రచార సహాయకులు, దృశ్య శ్రవణ సూపర్‌వైజర్‌గా 33 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించిన ఆగం సాయిబాబా ప్రభుత్వ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్‌వైజర్ (ఏవీఎస్)గా పనిచేసి మంగళవారం పదవీ విరమణ చేసిన ఆగం సాయిబాబాకు ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలోని డీఐపీఆర్వో కార్యాలయంలో మంగళవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సభకు విజయ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సాయిబాబా దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. 33 ఏళ్ల పాటు కాకినాడ, రాజమండ్రి, మచిలీపట్నం, విజయవాడలోని కార్యాలయాల్లో అలుపెరగని సేవలందించిన సాయిబాబా ప్రతిభను నేటితరం ఉద్యోగులు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. దాదాపు 10 మందికి పైగా జిల్లా కలెక్టర్ల వద్ద పని చేసి.. ప్రతి ఒక్కరితో శభాష్ అనిపించుకున్నారని చెప్పారు. ఆయన సేవలను భవిష్యత్తులో సమాచార శాఖ వినియోగించుకుంటుందన్నారు. కార్యక్రమంలో సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, సంయుక్త సంచాలకులు పి.కిరణ్‌కుమార్, టి.కస్తూరి, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ సీవీ కృష్ణారెడ్డి, డెప్యూటీ డైరెక్టర్ బి.పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం.భాస్కర్ నారాయణ, జీవీ ప్రసాద్, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహన్‌రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సహాయకులు వీవీ ప్రసాద్, కమిషనర్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ సహాయ సంచాలకులు, జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హాజరయ్యారు.

టీడీపీ, జనసేన ఇచ్చిన హామీలకు బీజేపీ గ్యారెంటీ లేదా..?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్డీఏ కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు బీజేపీ గారెంటీ లేదా..? అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ ప్రశ్నించారు. అందుకేనా మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతోపాటు ఉన్న బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సిద్ధార్థ సింగ్ అంటీ ముట్టనట్లుగా ఉండటమే కాకుండా మేనిఫెస్టో కాపీని పట్టుకోలేదని తెలిపారు. విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల ఉమ్మడి మేనిఫెస్టోపై టీడీపీ, జనసేన ఉద్దేశపూర్వకంగానే మోదీ ఫొటో ముద్రించలేదని పేర్కొన్నారు. సీఎం జగనన్న సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. సీఎం జగనన్న 'చెప్పాడంటే..చేస్తాడంతే' అన్న నమ్మకం ప్రజల్లో ఉందని, అలాగే ఆయన మేనిఫెస్టోను కూడా విశ్వసిస్తారని తెలిపారు.